క్లుప్తంగా

సంపరలో వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పెదపూడి: సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన ప్రాచీన వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం స్వామివారికి వేకువ జామున పంచామృతాభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి సాహస్ర తులసీదళాలతో, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తుల సామూహికంగా గోవిందనామా పారాయణం చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేషాలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు ప్రసాద వితరణ చేశారు.

కట్లమ్మ తల్లి మేలుకొలుపు



పందలపాకలో అమ్మవారి గరగ నృత్యాలు చేస్తున్న కళాకారులు

బిక్కవోలు: పందలపాక గ్రామ దేవత కట్లమ్మ తల్లి అమ్మవారి మేలుకొలుపు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి అమ్మవారి ప్రత్యేక పూజలు అనంతరం అమ్మవారి గరగను బయటి తీసారు. అనంతరం గరగ నృత్యాలు చేశారు. తర్వాత గ్రామోత్సవం చేశారు. ఈ నెల 11వ తేదీన జాతర, 12 తీర్థం సందర్భంగా అమ్మవారిని మేలుకొలుపు కార్యక్రమం నిర్వహించినట్టు ఆలయం కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలోని మాజీ ఎంపీటీసీ సబ్బెళ్ల విజయభాస్కర్‌రెడ్డి, గుణం శ్రీనివాస్‌చౌదరి, వల్లూరి రామకృష్ణ, గొర్రిపోటి సత్యనారాయణ, వైకుంఠ వేంకటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



దోసకాయలపల్లిలో శంకుస్థాపన నిర్వహిస్తున్న భక్తులు

కోరుకొండ: దోసకాయలపల్లిలో పర్వతవర్ధినీ సమేత ఉమారామలింగేశ్వరస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. అర్చకస్వాముల మంత్రోచ్ఛరణ నడుమ శంకు పన కార్యక్రమం జరిగింది. అనంతరం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. హోమంలో 26 పుణ్యదంపతులు కూర్చున్నారు. కార్యక్రమంలో పూర్వ. ధర్మకర్త మార్ని సుబ్బారాయుడు కుటుంబీకులు, ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాల పంపిణీ



ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాలను అందిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం: జగ్గంపేట, రాజానగరం నియోజకవర్గాల పరిధిలోని సీతానగరం, కోరుకొండ, రాజానగరం, గోకవరం మండలాలకు చెందిన 32 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వీల్ చైర్, ట్రై సైకిల్, చెవిటి మెషీన్ వంటి 52 ఉపకరణాలను పంపిణీ చేశారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వీటిని స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చేతుల మీదుగా వారికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మండారపు సీతారత్నం, ఎంపీడీఓ జెపి ఝన్సీ, తహసీల్దారు జీఎస్ఎల్ దేవి, అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

రంగంపేట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా నల్లమిల్లి, సింగంపల్లి, మర్రిపూడి గ్రామాల్లో కొత్తగా నిర్మాణం చేపట్టనున్న సీసీ రోడ్లుకు శంకుస్థాపన, నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లకు ప్రారంభోత్సవం ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వి.వీరసాయిబాబు, పీఆర్ జేఈ కె.శ్రీనివాసరావు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పథకం రివర్సేనా!

- రివర్స్ ఎత్తిపోతల పథకానికి రూ 91.10 కోట్ల మంజూరు
- అంతా మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి ఫలితమే
- నిధులు మంజూరైనా పనులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం



రాపాక వద్ద కొండ గోదావరి ఎగపోటుతో ముంపులోకి వెళ్లిన పంట పొలాలు (ఫైల్)

సీతానగరం: ఇప్పటి వరకు ఎత్తిపోతల పథకాలు నెలకొల్పి సాగునీరు అందించడం చూశాం.. కాని రాజానగరం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అత్యంత అద్భుతమైన ఆలోచనతో రివర్స్ ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దృష్టిలో ఉంచి రూ 91.10 కోట్లతో మంజూరు చేయించారు. ఈ పథకం టెండర్ల దశకు వచ్చింది. ఇంతలో ఎన్నికల ఎన్నికల కోడ్‌తో నిలిచింది. అయితే ఎన్నికలు పూర్తయి సుమారు ఏడాది పూర్తవుతున్నా ఇంతవరకూ ఈ పనులను ప్రారంభించలేదు. దీనిపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుంది. రివర్స్ ఎత్తిపోతల పథకం స్థానిక ఎమ్మెల్యే పట్టించుకున్న దాఖలాలు లేవు. రివర్స్ ఎత్తిపోతల పథకంతో పలు మండలాల్లో 25 వేల ఎకరాలు ముంపు నుంచి కాపాడుకునే అవకాశం ఉంది. అయినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు.

ఇదీ విషయం..

మండలంలో ఏటా రైతులు పండించిన పంటలు గోదావరి ముంపునకు గురవుతున్నాయి. ఆరుగాలం ఎంతో శ్రమించి పండించిన పంటలు నీటిపాలవుతుంటే వారి బాధ వర్ణనాతీతం. ఏటా వస్తున్న ముంపు నుంచి విముక్తికి కల్పిస్తూ అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆలోచనకు చర్యలు చేపట్టారు. సీతానగరం, కోరుకొండ మండలాల పంట పొలాలు ప్రతి ఏడాది ముంపునకు గురవుతున్నాయి. బురద కాలువ నుంచి వచ్చే నీరు తొర్రిగడ్డ కాలువలో కలిసి బొబ్బిల్లంక స్లూయిజ్ నుంచి వెళ్లి గోదావరిలో కలుస్తుంది. దీనికి అప్పటి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చెక్ పెట్టారు.

తొర్రిగడ్డ కాలువలో కలిసే విధానం

పలు మండలాల నుంచి వర్షం నీరు బురద కాలువ, కూనవరం డ్రైన్ నుంచి తొర్రిగడ్డ కాలువలో కలిసి బొబ్బిల్లంక స్లూయిజ్ నుంచి గోదావరిలోకి వెళుతుంది. గండేపల్లి, రాజానగరం నుంచి వచ్చే నీరు దోసకాయలపల్లి జగ్గప్ప చెరువులో కలిసి బూరుగుపూడి వద్ద అయ్యన్నగల్లు నుంచి బురదకాలువ ద్వారా తొర్రిగడ్డ కాలువలోకి వస్తుంది. అలాగే గంగవరం మండలం నుంచి శ్రీరంగపట్నం మీదుగా కాపవరం నుంచి గుమ్ములూరులో కలిసి తొర్రిగడ్డ కాలువలోకి వస్తుంది. కోరుకొండ నుంచి జంబుపట్నం బలరామయ్య చెరువు నుంచి అయ్యన్నగల్లులో కలుస్తుంది. రంపచోడవరం మండలం నుంచి వచ్చే నీరు దేవీపట్నం మీదుగా రాపాక నుంచి కూనవరం డ్రైన్ ద్వారా ఉండేశ్వరపురంలోని తొర్రిగడ్డ కాలువలో కలిచి బొబ్బిల్లంక స్లూయిజ్ ద్వారా గోదావరిలోకి తరలివెళుతుంది.

ముంపునకు కారణం ఇదే..

దేవీపట్నం, రంపచోడవరం, కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాలలో కురిసిన వర్షం నీరు, సూరంపాలెం ప్రాజెక్ట్ నుంచి విడుదల చేసిన మిగులు జలాల నీరు బురదకాలువ ద్వారా బొబ్బిల్లంక కాలువకు చేరుకుని గోదావరిలో కలుస్తాయి. దీనిని కొండ గోదావరి అని అంటారు. అదే



బొబ్బిల్లంక తొర్రిగడ్డ కాలువపై ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసే ప్రదేశం

సమయంలో అఖండ గోదావరి వరద పోటెత్తి నీటిమట్టం పెరిగితే బొబ్బిల్లంకలోని స్లూయిస్ తలుపులు ఆటోమేటిక్‌గా మూసుకుపోతాయి. తగ్గితే గేట్లు తెరచుకుని కొండ గోదావరి నీరు స్లూయిజ్ ద్వారా గోదావరిలోకి వెళుతుంది. గోదావరి వరద సమయంలో వరద నీట్టి మట్టం ఎక్కువగా ఉంటే స్లూయిజ్ గేట్లు మూసుకుపోవడంతో కొండ గోదావరి ఎగపోటుతో నియోజకవర్గంలోని 25 వేల ఎకరాలు పంట నీటమునిగి రైతులు నష్టపోతున్నారు.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం రివర్స్ ఎత్తిపోతల పథకంపై కన్నెత్తి కూడా చూడడం లేదు. స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడంలేదు. బొబ్బిలంక స్లూయిజ్ దగ్గరలో నెలకొల్పే రివర్స్ ఎత్తిపోతల పథకంపై ఇంత వరకు దృష్టిసారించలేదు. మంజూరై ఉన్న రివర్స్ ఎత్తపోతల పథకంపై శ్రద్ధ చూపాలని రైతులు కోరుతున్నారు.

అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో...

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పంట పొలాలు ముంపు బారిన పడకుండా మంచి ఆలోచన చేశారు. బొబ్బిల్లంక స్లూయిజ్ వద్ద తొర్రిగడ్డ కాలువపై రివర్స్ ఎత్తిపోతల పథకం నిర్మించి, గోదావరి వరద సమయంలో కొండగోదావరి నీటిని గోదావరిలోకి ఎత్తిపోస్తే పంటపొలాలు ముంపు నుంచి రక్షించవచ్చని ఆలోచనకు జీవం పోశారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దృష్టిలో ఉంచి ఎత్తిపోతల పథకంకు రూ.91.10 కోట్లు రాబట్టారు. దీనితో సీతానగరం మండలం కూనవరం, రాపాక, చినకొండేపూడి, పెదకొండేపూడి, రఘుదేవపురం, ఉండేశ్వరపురం, బొబ్బిల్లంక గ్రామాలు కోరుకొండ మండలంలో జగన్నాథపురం, గుమ్ములూరు, కాపవరం, బూరుగుపూడి, మునగాల గ్రామాల 25 వేల ఎకరాల పంటపొలాలు ముంపు నుంచి బయటపడనున్నాయి.

రైతులకు మేలు



మాజీ ఎమ్మెల్యే రాజా ఆలోచన ఎంతో బాగుంది. బొబ్బిల్లంక స్లూయిజ్ వద్ద తొర్రిగడ్డ కాలువపై ఎత్తిపోతల పథకం నెలకొల్పి కొండగోదావరి నీటిని ఎత్తిపోస్తే ఎప్పటికి పంటపొలాలు ముంపులోకి వెళ్లవు. సీతానగరం, కోరుకొండ మండలాల పంటపొలాల రైతులు ఎంతో మేలు జరుగుతుంది. స్థానిక ఎమ్మెల్యే దీనిపై దృష్టిసారించాలి.

– జొన్నలగడ్డ సత్యనారాయణ, మిర్తిపాడు, రైతు

ఎన్నికల కోడ్‌తో..



బొబ్బిల్లంక వద్ద తొర్రిగడ్డ కాలువపై ఎత్తిపోతల పథకం నిర్మాణానికి రూ 91.10 కోట్లు నిధులు మంజూరయ్యాయి. టెండర్ల దశకు వచ్చింది. ఎన్నికల కోడ్‌తో నిలిచింది. కొండగోదావరి ఎగపోటుతో రైతుల పంటపొలాలు ముంపులోకి వెళుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అద్భుతమైన ఆలోచన. ఇది జరుగుంటే రైతులకు ఎంతో మేలు జరిగేది. ఇప్పటికైనా స్పందించండి.

– వలవల వెంకట్రాజు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి, సీతానగరం

గ్రావెల్ అక్రమ రవాణాపై జనాగ్రహం

- లారీలను అడ్డుకున్న కలవచర్ల గ్రామస్తులు
- పాడైపోతున్న రోడ్లు
- అధికారులకు చెప్పినా ఫలితం శూన్యం



లారీలను అడ్డుకుని రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు



నిలిచిన లారీలు



లారీలను అడ్డుకున్న కలవచర్ల గ్రామస్తులు

రాజానగరం: మండలంలోని కలవచర్ల గ్రామస్తులు గ్రావెల్ అక్రమ రవాణాపై తిరగబడ్డారు. అడ్డూ, అదుపు లేకుండా వందల కొద్దీ లారీలలో రవాణా జరుగుతుంటే రోడ్లు పాడై, దుమ్ము, ధూళి కమ్మేస్తున్న వేళ, సహనం నశించిన జనం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ విధమైన అనుమతులూ లేకపోయినా, అధికారాన్ని అడ్డు పెట్టుకుని సాగిస్తున్న ఈ అక్రమ దందాపై విరుచుకుపడ్డారు. కలవచర్ల శివారు పోలవరం కాలువ గట్టున శనివారం రాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి... కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్న రోడ్డు పనులు ఇంకా పూర్తి కాలేదు. ఈ తరుణంలో గత నెల రోజులుగా పోలవరం కాలువ గట్టున ఉన్న గ్రావెల్‌ని పొక్లెయిన్‌తో తోడేసి, లారీల ద్వారా అక్రమ రవాణా చేస్తున్నారు. అధికార పార్టీ పెద్దల పేరుతో జరుగుతున్న ఈ దందాపై కలవచర్ల గ్రామస్తులు కొందరు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి ఫలితం లేకపోయింది. అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో నిత్యం ఈ రోడ్డుపై వందలాది లారీలలో గ్రావెల్ మట్టిని తరలిపోతున్నారు. ఇదే విషయాన్ని 'య. థేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు' శీర్షికన సాక్షిలో గత నెల 27న కథనం వచ్చిన సంగతి విదితమే. అయినప్పటికీ సంబంధిత అధికారులు స్పందిచలేదు. అక్రమ రవాణా ఆగలేదు. దీనితో విసిగిపోయిన జనం శనివారం రాత్రి ఇళ్ల నుంచి బయటకు వచ్చి, గ్రావెల్ తరలించుకుపోతున్న లారీలకు అడ్డుగా నిలిచారు. మీ అక్రమ దందాతో రోడ్లు పాడై, దుమ్ము ధూళితో మా ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని, దయచేసి పర్యావరణాన్ని కలుషితం చేయవద్దని వేడుకున్నారు. హెల్మెట్ పెట్టుకున్నా ధూళితో దారి కనిపించడం లేదని, దీంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయన్నారు. దోచుకోవడమే ధ్యేయంగా ఉన్న గ్రావెల్ చోరులకు జనం గోడు వినిపిస్తుందా? వారి రోదన అరణ్య రోధనగానే మిగిలిపోతుంది. జనాగ్రహంతో గ్రావిల్ మట్టి తవ్వకం పనులు తాత్కాలికంగా ఆపినా గానీ, జనం వెళ్లిన తరువాత దందాను కొనసాగించడం కొసమెరుపు.



వైఎస్సార్‌సీపీ కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన చిర్ల జగ్గిరెడ్డిని కలిసి సత్కరించిన పార్టీ యువజన విభాగం బిక్కవోలు మండల అధ్యక్షుడు సత్తి వెంకట సూర్య నారాయణ రెడ్డి (పెద్ద), మల్లిడి సురేష్ రెడ్డి

రోడ్డు ప్రమాదంలో యువకులకు తీవ్ర గాయాలు



అపస్మారక స్థితిలో ఉన్న అంజిబాబు

సీతానగరం: యువకులకు ప్రమాదవశాత్తూ మోటారు సైకిల్‌పై నుంచి పడి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం మధ్యాహ్నం 3.15 గంటలకు వెదుళ్లపల్లి పంచాయతీ పరిధిలోని రాజంపేటకు చెందిన 17 ఏళ్ల యువకులు బట్టా అంజి, టి.అరవింద్ మోటారు సైకిల్‌పై రాజమహేంద్రవరం వెళ్లుతుండగా బొబ్బిల్లంక బ్రిడ్జ్ దగ్గరలో ప్రమాదవశాత్తూ మోటారుసైకిల్‌పై నుంచి పడిపోయారు. దీంతో అంబిబాబు కుడికాలు తొడ ఎముక విరిగి అపస్మారక స్థితికి వెళ్లాడు. అరవింద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108లో రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

మహిళ అదృశ్యం

కోరుకొండ: అప్పు విషయమై భార్యా భర్తల మధ్య వాగ్వివాదంతో అలిగిన భార్య ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన కోరుకొండ మండలం గాడాలలో శనివారం జరిగింది. కోరుకొండ పోలీసుస్టేషన్ ఎస్సై కూన నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గాడాలకు చెందిన పాపారావు అప్పులు ఎక్కువగా చేస్తున్నావని భార్య దేవిపై కోపగించుకున్నాడు. అప్పుడు ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో అలిగిన భార్య ఇంటినుంచి వెళ్లిపోయినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నాగరాజు తెలిపారు.

పేకాడుతున్న 12 మంది అరెస్టు

సీతానగరం: మండలంలని మునికూడలి, బొబ్బిల్లంక లలో పేకాటాడుతున్న 12 మందిని అరెస్టు చేసి కేసులు నమోదు చేసినట్టు ఎస్సై డి.రామ్ కుమార్ శనివారం తెలిపారు. మునికూడలి శివారున పేకాటాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.12,510 స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామన్నారు. అదే విధంగా బొబ్బిల్లంకలో పేకాటాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.3,290 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని, వారిని కోర్టులో హాజరుపర్చుతామన్నారు.

నర్సరీని సందర్శించిన సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్

కడియం: బుర్రిలంకలోని ఉమాపార్వతి నర్సరీని సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ రాహుల్ శనివారం సందర్శించారు. భారీ వృక్షాలను సేకరించి తీసుకువచ్చి నర్సరీలో వాటిని రైతు కొత్తపల్లి మూర్తి అభివృద్ధి చేస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో సంబంధిత వివరాలను సూపరింటెండెంట్‌కి రైతులు వివరించారు. ఆయన వెంట డీఎస్పీ రాజ్ కుమార్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

తుపాను హెచ్చరికలతో రైతుల ఆందోళన



బూరుగుపూడి లేఅవుట్‌లో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

కోరుకొండ: తుపాను హెచ్చరికల నేపథ్యంలో మెట్ట ప్రాంత రైతాంగం ఆందోళన చెందుతోంది. రబీ మాసూళ్లు పూర్తి చేసి ధాన్యాన్ని ఆరబెట్టి విక్రయాలు చేసే సమయంలో తుపాను ఇబ్బందికి గురి చేస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కోరుకొండ మండలంలోని రైతులు ధాన్యాన్ని అమ్మడానికి ఆరబెడుతున్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు జరగకపోవడంతో ప్రైవేటు వ్యాపారులపై ఆధారపడ్డారు, కోరుకొండ మండలంలో రబీ సీజన్‌లో ఎంటీయూ 1121, 1156, ఆర్ఎన్ఆర్ 15048 రకాలను పండించారు. మండలంలో సుమారు 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి జరిగింది. కాగా అమ్మకాలు లేవు. ఇదిలా ఉండగా, వర్షాలకు ధాన్యం తడిచిపోవడంతో రైతులు ఆరబెట్టి అమ్ముతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వకపోగా రైతాంగం ఆవేదన చెందుతోంది. పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా కూటమి ప్రభుత్వం కాలయాపనచేస్తోందని కొంతమంది ఆరోపిస్తున్నారు. ధాన్యాన్ని బూరుగుపూడి, దోసకాయలపల్లి, రాఘవపురం, కోటికేశవరం, కోటి, శ్రీరంగ పట్నం, మునగాల, తదితర గ్రామాల్లో ఆరబెట్టుకుంటున్నారు.

వడదెబ్బపై అవగాహన



ఇనుగంటివారిపేటలో వడదెబ్బపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సీతానగరం: ఇనుగంటివారి పేటలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య ఆరోగ్య సిబ్బంది శనివారం అవగాహన కల్పించారు. శనివారం సీతానగరం పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు మాట్లాడుతూ సీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఏవీకే చైతన్య ఆధ్వర్యంలో మండల గ్రామాల్లో వడదెబ్బపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. వడదెబ్బ తగలకుండా ప్రజలు పలు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న సమయంలో ప్రయాణాలు మానుకోవాలని, టోపి, గొడుగు, తలకు టవల్ ధరించాలని, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, పిల్లలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వేడిగాలి చెవిలోనికి వెళ్లకుండా చూసుకోవాలని, డిహైడ్రేషన్ రాకుండా ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎల్.వెంకట్ విఠల్, ఏఎస్ఎం సీహెచ్ శాంతి, మహిళా పోలీస్ కె అమ్మాజీ, అంగన్‌వాడీ వర్కర్ కె.దివ్యభారతి, ఆశా వర్కర్లు ఎస్.పుష్పరాజ్యం, కె.మణికుమారి, స్థానికులు పాల్గొన్నారు.

జర భద్రం!



కాటన్ బ్యారేజ్ దిగువ శనివారం సాయంత్రం స్నానాలు చేస్తున్న సందర్శకులు

- ఆనందం మాటున ప్రమాదం
- ఇసుక తిన్నెల మధ్యలో దొంగ ఊబులు
- పర్యాటకులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్న అధికారులు



ఇసుక తిన్నెలకు వెళ్లకుండా బ్యారేజ్ దిగువ మూసివేసిన మార్గం

ధవళేశ్వరం: పర్యాటకులు, స్థానికులను విశేషంగా ఆకర్షించే గోదావరి ఇసుక తిన్నెల మాటున ప్రమాదం పొంచి ఉంది. వేసవి రావడంతో గోదావరి నీటి ప్రవాహం తగ్గి బ్యారేజ్ దిగువ ఇసుక తిన్నెలు పైకి తేలాయి. సాయంత్రం సేద తీరేందుకు కాటన్ బ్యారేజ్‌కు వచ్చేవారికి ఆ ఇసుక తిన్నెలు మరింత ఆనందాన్ని, ఆహ్లాదాన్ని అందజేస్తున్నాయి. దీంతో ఈ ఇసుక తిన్నెల్లో సేదతీరేందుకు పర్యాటకులు, స్థానికులు ఎక్కువ మందే వస్తున్నారు. వివరాల్లోకి వెళితే ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ దిగువన ఇసుక తిన్నెలు నీటి ప్రవాహం లేకపోవడంతో పైకి తేలాయి. బ్యారేజ్‌ను చూసేందుకు వచ్చే పర్యాటకులు, సాయంత్రం వేళ సేదతీరేందుకు వచ్చే స్థానికులు ఈ ఇసుక తిన్నెలకు ఆకర్షితులై కిందకు వెళుతున్నారు. ఇసుక తిన్నెల్లో కొంతసేపు సేదతీరుతున్నారు. అనంతరం ఇసుక తిన్నెలు మధ్యలో ఉన్న గోదావరి నీటిలో స్నానానికి దిగి మృత్యువాత పడుతున్నారు. ముఖ్యంగా ఇసుక తిన్నెల మధ్యలో దొంగ ఊబులు ఉండడంతో అనేక మంది స్నానానికి దిగి ప్రాణాలను కోల్పోతున్నారు. ఇక్కడ నాచు పట్టి ఉండడంతో ప్రమాదాలు జరిగేందుకు ఎక్కువ అవకాశం ఉంది. పర్యాటకులు వీటిని గమనించాలని అధికారులు సూచిస్తున్నారు.

సిబ్బంది చెబుతున్నా..

కాటన్ బ్యారేజ్ చూసేందుకు వచ్చే పర్యాటకులు, స్థానికులు దిగువన ఉన్న దొంగ ఊబులపై జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. బ్యారేజ్ దిగువ స్నానాలకు దిగవద్దని ఇసుక తిన్నెల్లో ప్రమాదకరమైన ఊబులు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు.

ఉపేక్షించేది లేదు



బ్యారేజ్ దిగువకు స్నానానికి వెళ్లడం ప్రమాదకరం. దిగువ ఇసుక తిన్నెల్లో దొంగ ఊబులు ఉండటంపై హెచ్చరిక బోర్డులను సైతం ఇరిగేషన్ అధికారులు ఏర్పాటు చేశారు. పోలీస్ సిబ్బంది బ్యారేజ్‌పై సాయంత్రం వేళ గస్తీ తిరుగుతున్నారు. హద్దు మీరి బ్యారేజ్ దిగువకు స్నానానికి దిగితే ఉపేక్షించేది లేదు.

– టి గణేష్, సీఐ, ధవళేశ్వరం

అయితే పలువురు వీటిని ఖాతరు చేయకుండా ఒక్కొక్క సందర్భంలో ఇరిగేషన్ సిబ్బందితో సైతం వాగ్వివాదానికి దిగి కిందకు వెళుతున్నారు. ప్రతి ఏడాది ఈ ఇసుక తిన్నెల్లో అనేక మంది మృత్యువాత పడుటంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఇరిగేషన్ అధికారులు సూచిస్తున్నారు. దీనిపై ఇప్పటికే బ్యారేజ్ వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు.

పదేళ్లలో 50 మందికి పైనే మృత్యువాత

గడచిన పదేళ్లలో కాటన్ బ్యారేజ్ దిగువ స్నానానికి దిగి సుమారు 50 మందికి పైనే మత్యువాత పడ్డారు. ముఖ్యంగా వీరిలో 20 ఏళ్లలోపు యువకులే అధికంగా ఉంటున్నారు. దీంతో అప్రమత్తమైన ఇరిగేషన్ అధికారులు బ్యారేజ్ దిగువన దొంగ ఉబులు ఉన్నాయని హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. అదే విధంగా తూర్పు డెల్టా లాక్ నుంచి బ్యారేజ్ దిగువకు వెళ్లే మార్గాన్ని సైతం మూసివేసి హెచ్చరిక బోర్డులను పెట్టారు. అయినప్పటికీ వీటిని పట్టించుకోని యువకులు కిందకు దిగి మత్యువాత పడుతున్నారు.